సాక్షి

డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

శనివారం । 4 । జనవరి । 2025



అందాలొలికిన ఆలమంద!

రాష్ట్ర స్థాయి ఆవుల పాల, ఎద్దుల అందాల పోటీలు శుక్రవారం మలికిపురం మండలం కేశనపల్లి ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ప్రారంభమయ్యాయి.


II లో



కోళ్లాహలం

ఆర్యావటం సంత మార్కెట్‌లో పందెం కోడి పుంజుల అమ్మకాలు జోరుగా సాగాయి. ప్రతి శుక్రవారం విద్యుత్ సబ్‌స్టేషన్ పక్కన ఉన్న మార్కెట్‌లో కోళ్ల సంత జరుగుతుంది.

డెల్టాలకు నీటి విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శుక్రవారం 12,810 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 3,780, మధ్య డెల్టాకు 2,460, పశ్చిమ డెల్టాకు 6,570 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

నేటి నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం

వనుము సోమశేఖరరావు, డీఐఈవో



అమలాపురం టౌన్: జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం పేరుతో విద్యార్థులకు శనివారం నుంచి భోజనాలు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారి (డీఐఈవో) వనుము సోమశేఖరరావు తెలిపారు. ఈ మేరకు డీఐఈవో అమలాపురంలో శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లాలోని 13 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనాలు చేసేందుకు అవసరమైన కంచాలు, గిన్నెలు, గ్లాసులతోపాటు వండిన పదార్థాలు ఉంచేందుకు హాట్ ప్యాక్‌లు ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ ఇప్పటికే కొనుగోలు చేశారని పేర్కొన్నారు. ప్రతి కళాశాలకు సమీపంలో గల ఒక ఉన్నత పాఠశాలను భోజనాల కోసం జత చేశామన్నారు. జిల్లాలోని 13 ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు సంబంధించి జనరల్, ఒకేషనల్ ఇంటర్మీడియెట్ విద్యను అభ్యసిస్తున్న వారు ఈ పథకానికి అర్హులన్నారు. ప్రథమ సంవత్సరంలో 1,382 మంది, ద్వితీయ సంవత్సరంలో 1,132 మంది విద్యార్థులు ఈ పథకానికి అర్హులని తెలిపారు.

హైందవ శంఖారావం బ్రోచర్ల విడుదల



హైందవ శంఖారావం మహాసభ కరపత్రాలు, బ్రోచర్లను విడుదల చేస్తున్న వీహెచ్‌పీ, బజరంగ్ దళ్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: విజయవాడలో ఆదివారం జరగనున్న హైందవ శంఖారావం మహాసభకు జిల్లా నుంచి హిందువు అయిన ప్రతి ఒక్కరూ తరలి వెళ్లి విజయవంతం చేయాలని విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) జిల్లా అధ్యక్షుడు అక్కిరెడ్డి సుబ్రహ్మణ్యం పిలుపునిచ్చారు. శంఖారావం మహాసభకు తరలి వెళ్లడం ద్వారా హిందువుల ఐక్యతను చాటుదామని అన్నారు. స్థానిక ప్రెస్ క్లబ్ భవనంలో శుక్రవారం జరిగిన సమావేశంలో వీహెచ్‌పీ, బజరంగ్ దళ్, ధర్మ ప్రచారక్, ధర్మ రక్షక్ తదితర ధార్మిక సంస్థల ప్రతినిధులతో సుబ్రహ్మణ్యం మాట్లాడారు. ఈ సందర్భంగా హైందవ శంఖారావం కరపత్రాలు, బ్రోచర్లను వారు విడుదల చేశారు. దేశమంతటా హిందూ దేవాలయాలకు స్వయం ప్రతిపత్తిని కోరుతూ వీహెచ్‌పీ దేశవ్యాప్త ఉద్యమానికి శ్రీకారం చుట్టిందని రాష్ట్ర సత్సంగ ప్రముఖ్ రాళ్లపల్లి పాపయ్యశర్మ స్పష్టం చేశారు. బజరంగ్ దళ్ రాష్ట్ర సహాయ ప్రముఖ్ శిరంగు నాయుడు, ధర్మ ప్రచారక్ జిల్లా ప్రముఖ్ పెండ్యాల సీతారామ్, విశేష సంపర్క ప్రముఖ్ భమిడిపాటి కృష్ణమూర్తి, ధర్మ రక్షక్ కుడుపూడి గోపాల కృష్ణ తదితర ధార్మిక సంస్థల ప్రతినిధులు మాట్లాడారు.

ఫిషింగ్ బోట్లలో తనిఖీలు

ఏడు ఆలివ్ రిడ్లే తాబేళ్లు సముద్రంలో విడుదల

తాళ్లరేవు: కాకినాడ జిల్లా పరిధిలోని ఎన్టీఆర్, ఉప్పాడ బీచ్‌లలో ఆలివ్ రిడ్లే తాబేళ్లు మృతిచెందుతున్నాయన్న వార్తల నేపథ్యంలో శుక్రవారం ఫారెస్ట్ అధికారుల బృందం తనిఖీలు నిర్వహించింది. ఫారెస్ట్ రేంజర్ ప్రసాదరావు ఆధ్వర్యంలో కోరంగి పంచాయతీ హోప్ ఐలాండ్ ప్రాంతంలో నిర్వహించిన ఈ తనిఖీలలో భాగంగా రెండు ఫిషింగ్ బోట్లలో తనిఖీ చేయగా ఒక బోటులో నాలుగు, మరో బోటులో మూడు తాబేళ్లు జీవించి ఉన్నట్లు గుర్తించామన్నారు. వలలను కత్తిరించి తాబేళ్లను సముద్రంలో వదిలివేసి బోట్లను స్వాధీన పరచుకున్నట్లు ప్రసాదరావు తెలిపారు. ఇకపై హోప్‌ఐలాండ్ ప్రాంతంలో 5 కిలోమీటర్ల దూరం దాటి ఫిషింగ్ చేసుకోవాలని లేకుంటే వారిపై వైల్డ్‌లైఫ్, ఫిషరీస్ చట్టాల ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

నేటి నుంచి పక్షుల గణన

తాళ్లరేవు: అంతర్జాతీయ నీటి పక్షులను గుర్తించేందుకు శని, ఆదివారాలలో నీటి పక్షుల గణన నిర్వహించనున్నట్లు ఫారెస్ట్ రేంజర్ ఎస్ఎస్ఆర్ ప్రసాదరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అటవీశాఖ ఆధ్వర్యంలో జరుగనున్న ఈ పక్షుల గణనకు సంబంధించి బాంబే నేషనల్ హిస్టరీ సొసైటీ (బీఎన్‌హెచ్‌ఎస్) బర్డ్స్ వాటర్ సొసైటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, డెక్కన్ బర్డ్స్ హైదరాబాద్ తదితర సంస్థలతోపాటు కళాశాల విద్యార్థులు మొత్తం 60 మందికి పైగా పాల్గొంటారని తెలిపారు. దీనిలో భాగంగా 4వ తేదీన లెక్కింపు ఎలా చేయాలి అన్నఅంశంపై కోరంగి బయోడైవర్సిటీ సెంటర్‌లో అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. అభయారణ్యం పరిధిలోని 12 పక్షి ఆవాస ప్రాంతాల్లో బృందానికి ఐదుగురు చొప్పున నీటిపక్షుల గణన చేపడతారని ప్రసాదరావు తెలిపారు.

ఇదేం వరస!



గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో పూర్తయిన 216 జాతీయ రహదారిలోని అమలాపురం బైపాస్ రోడ్డు



మామిడికుదురు జూనియర్ కాలేజీ వద్ద నిలిచిపోయిన 216 జాతీయ రహదారి విస్తరణ పనులు

కత్తిపూడి నుంచి ఒంగోలు వరకు ఉన్న జాతీయ రహదారి 216 పనులు ఇప్పటికీ పలుచోట్ల పూర్తి కాలేదు. రైల్వే ఫ్లై ఓవర్లు, బైపాస్ రోడ్ల భూసేకరణకు అవాంతరాల వల్ల రహదారి పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాలేదు. ఇదే సమయంలో ఈ రహదారిని ఆరు.. నాలుగు వరుసలుగా మార్చాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం విశేషం.

- 216 హైవే రెండు వరుసలు పూర్తి కాకుండానే నాలుగు లేన్లకు నిర్ణయం
- జాతీయ రహదారిపై కాకినాడ, పెడన వద్ద పూర్తి కాని రైల్వే ఫ్లై ఓవర్లు
- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జోరుగా సాగిన పనులు
- నాలుగు వరుసలైతే మారనున్న పలు గ్రామాల రూపురేఖలు
- ఇటీవల భారీగా పెరిగిన వాహనాల రద్దీ

సాక్షి, అమలాపురం: కాకినాడ జిల్లా కత్తిపూడి నుంచి ఒంగోలు వరకు 216 జాతీయ రహదారి పనులు 2015లో రూ.నాలుగు వేల కోట్ల అంచనాతో మొదలయ్యాయి. కాకినాడ, డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, కృష్ణా, బాపట్ల, ఒంగోలు జిల్లాల మీదుగా ఇది సాగుతోంది. కోస్తా ఆంధ్రాకు జీవనాడి ఈ రహదారి. జాతీయ రహదారి 16కు సమాంతరంగా ఈ రహదారి ఉంది. ఇటీవల రాకపోకలు రెట్టింపయ్యాయి. కత్తిపూడి నుంచి కాకినాడ పట్టణ శివారు తిమ్మాపురం వరకు నాలుగు వరుసలుగాను, అక్కడ నుంచి ఒంగోలు వరకు రెండు వరుసలుగా నిర్మిస్తున్నారు. పనులు మొదలై తొమ్మిదేళ్లు కావస్తున్నా ఇప్పటికీ పలు కీలక ప్రాంతాల్లో పూర్తి కాలేదు. ఇతర జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్ వే లతో పోల్చుకుంటే ఈ రహదారి నిర్మాణ పనులు నత్తను తలపిస్తున్నాయంటే అతిశయోక్తి కాదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో భూసేకరణ, ఇతర సాంకేతిక అనుమతులు సాధించడంతో పనులు వేగమందుకున్నాయి.

భూ సేకరణతో సామాన్యులు, వ్యాపారులకు నష్టం

ఇప్పుడు ఈ రహదారిని ఆరు వరుసలు, నాలుగు వరుసల రహదారిగా విస్తరించాలని కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. మొత్తం 390 కిమీల పొడవున ఉన్న ఈ రహదారిని కత్తిపూడి నుంచి కాకినాడ వరకు ఆరు వరుసలు, అక్కడ నుంచి ఒంగోలు వరకు నాలుగు వరుసల నిర్మాణం చేసేందుకు డీపీఆర్ సిద్ధం చేసే పనిలో ఉన్నట్టు ఎన్‌హెచ్ వర్గాలు చెబుతున్నాయి. ముందుగానే రహదారిని నాలుగు వరుసలుగా విస్తరించి ఉంటే వేరేగా ఉండేది. కాని తొలుత రెండు వరుసలు చేసి ఇప్పుడు నాలుగు వరుసలుగా మార్చి భూసేకరణ చేస్తే పలు గ్రామాలకు చెందిన సామాన్యులు, వ్యాపారులు నష్టపోనున్నారు. ప్రధానంగా జాతీయ రహదారి నిర్మాణం జరిగిన తరువాత చాలామంది వీటిని ఆనుకుని వ్యాపార, వాణిజ్య సముదాయాలను నిర్మించారు. కాకినాడ జిల్లాలో పండూరు, చిత్రాడ, కోరంగి, మట్లపాలెం, డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో మురమళ్ల, శివకోడు, పశ్చిమ గోదావరి జిల్లా లోసరి, కృష్ణా జిల్లా కృతివెన్ను వంటి గ్రామాల్లో భూసేకరణ వల్ల స్థానికులు నష్టపోయే పరిస్థితి నెలకొననుంది.

పూర్తికాని రైల్వే ఫ్లై ఓవర్లు

కాకినాడ బైపాస్‌తోపాటు, కృష్ణా జిల్లా పెడన వద్ద రైల్వే ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు పూర్తికాలేదు. తిమ్మాపురం వై.జంక్షన్ నుంచి కాకినాడ మండలం తూరంగి వరకు నిర్మిస్తున్న బైపాస్ వినియోగంలోకి రాలేదు. ఈ దారికి సంబంధించి కొవ్వాడ వద్ద, అచ్చంపేట వద్ద నిర్మించిన ఫ్లై ఓవర్ అప్రోచ్ రోడ్డు గోడలు కుంగిపోయాయి. మాధాపురం వద్ద రైల్వే లైన్ క్రాసింగ్ వద్ద నిర్మిస్తున్న ఫ్లై ఓవర్ పనులు ఇంకా పూర్తి కాలేదు. కృష్ణా జిల్లా పెడన వద్ద సైతం రైల్వేలైన్‌పై నిర్మించే ఫ్లై ఓవర్ అప్రోచ్ రోడ్డు నిర్మాణం చేయలేదు. భూ సేకరణ సమస్య వల్ల డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో పాశర్లపూడి వంతెన వద్ద నుంచి శివకోడు వరకు బైపాస్ నిర్మాణ పనులు సైతం అసంపూర్తిగా ఉన్నాయి.

మత్స్యకారులను ఆదుకుంటాం

– ఎమ్మెల్యే దాట్ల



నష్ట పరిహారం చెక్కును అందజేస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు. చిత్రంలో మంత్రులు, ఎమ్మెల్యేలు

తాళ్లరేవు: చమురు సంస్థల కార్యకలాపాల కారణంగా నష్టపోతున్న మత్స్యకారులను ఆదుకుంటామని ముమ్మిడివరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు తెలిపారు. శుక్రవారం కోరంగిలో జరిగిన ఓఎన్‌జీసీ నష్టపరిహార పంపిణీ కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించారు. రాష్ట్ర వ్యవసాయ, సహకార, మత్స్యశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు ముఖ్య అతిథిగా హాజరై రూ.148.37 కోట్ల చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. ఎమ్మెల్యే దాట్ల మాట్లాడుతూ చమురు సంస్థల కార్యకలాపాల కారణంగా మత్స్యసంపదకు ముప్పు వాటిల్లి మత్స్యకారులు నష్టపోతున్నందున పరిహారం అందజేస్తున్నట్లు తెలిపారు. పుదుచ్చేరి అధికార ప్రతినిధి మల్లాడి కృష్ణారావు మాట్లాడుతూ మత్స్యకారుల్లో ఉన్న 14 ఉపకులాలకు వారికి కూడా పరిహారం అందించాలని కోరారు. మంత్రులు వాసంశెట్టి సుభాష్, కొల్లు రవీంద్ర, ఎంపీ గంటి హరీష్‌మాథుర్, యనమల రామకృష్ణుడు, చిక్కాల రామచంద్రరావు, నిమ్మకాయల చినరాజప్ప, ఎమ్మెల్యేలు వనమాడి కొండబాబు, అయితాబత్తుల ఆనందరావు, బండారు సత్యానందరావు, వేగుళ్ల జోగేశ్వరరావు, జ్యోతుల నవీన్, రెడ్డి సుబ్రహ్మణ్యం, మత్స్యశాఖ కమిషనర్ టి.డోలా శంకర్, ఎంపీపీ రాయుడు సునీత, కోరంగి సర్పంచ్ పెయ్యల మంగేష్ పాల్గొన్నారు. కాగా కార్యక్రమంలో ప్రముఖులకు మాట్లాడే అవకాశం ఇవ్వకపోవడంపై పలువురు చర్చించుకున్నారు. అయితే మంత్రి అచ్చెనాయుడు మాట్లాడుతుండగానే చాలామంది లేచివెళ్లిపోవడం కనిపించింది.

సృజన విరిసే వేళలో..

- నేడు పి.గన్నవరం జెడ్పీ హైస్కూల్‌లో జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్
- 110 ప్రాజెక్టులను సిద్ధం చేస్తున్న జిల్లా సైన్స్ విభాగం
- ప్రారంభించనున్న కలెక్టర్ డాక్టర్ మహేష్‌కుమార్



పి.గన్నవరం: ఎందుకు..ఏమిటి..ఎలా అనే ప్రశ్నలు నూతన ఆవిష్కరణలకు నాంది పలుకుతాయి. తరగతి గదుల్లో విద్యార్థులు నేర్చుకున్న అంశాలకు సృజనాత్మకతను జోడించాల్సిన సమయం ఆసన్నమైంది. విద్యార్థి దశ నుంచే ప్రతిభను వెలికి తీసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇన్‌స్పైర్ మనాక్, బాలల సైన్స్ కాంగ్రెస్, జాతీయ సైన్స్ దినోత్సవం తదితర ప్రతిభా పోటీలు నిర్వహిస్తుంటాయి. ఏటా జిల్లా స్థాయిలో విద్యా వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాటు చేస్తుంటారు. అందులో భాగంగా ఈ ఏడాది జిల్లా విద్యా వైజ్ఞానిక ప్రదర్శనకు పి.గన్నవరం జెడ్పీ ఉన్నత పాఠశాల వేదికగా నిలుస్తోంది. ఇప్పటికే జిల్లాలోని 22 మండలాల్లో విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు జరిగాయి. మండల స్థాయిలో నిర్వహించిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో ఎంపిక చేసిన ఐదు ప్రాజెక్టులు జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు రానున్నాయి. సైన్స్‌ఫేర్‌కు జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీం బాషా ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రతి మండలం నుంచి ఐదు కేటగిరీల్లో..

విద్యార్థులకు రెండు విభాగాల్లో పోటీలు నిర్వహించారు. విద్యార్థి విభాగంలో వ్యక్తిగత, గ్రూపు యాక్టివిటీస్ నుంచి రెండేసి వంతున ప్రాజెక్టులను జిల్లా స్థాయికి ఎంపిక చేశారు. ఉపాధ్యాయ విభాగం నుంచి ఒక ప్రాజెక్టు జిల్లాకు ఎంపిక చేశారు. ఈ విధంగా ప్రతి మండలం నుంచి ఐదు ప్రాజెక్టులు జిల్లా స్థాయికి ఎంపికయ్యాయి. 22 మండలాల నుంచి 110 ప్రాజెక్టులను జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనకు చేరుకోనున్నాయి. ఫిజిక్స్, కెమిస్ట్రీ, గణితం, బయాలజీ, ఖగోళశాస్త్రం, పర్యావరణ శాస్త్రం, ఇంజినీరింగ్ ఇన్ కంప్యూటర్ సైన్స్ అనే అంశాల్లో పోటీలు నిర్వహిస్తారు. పోటీలో పాల్గొనాలనుకొనే ఉపాధ్యాయుడు ఒకరు మాత్రమే ఏడు విభాగాల్లో ఏదో ఒక దానిని ఎంచుకోవాలి. వ్యక్తిగత విభాగంలో పోటీ పడే విద్యార్థులు ఏడు అంశాల్లో ఏదో ఒక దాన్ని ఎంచుకుని గైడ్ టీచర్‌తో కలిసి పోటీ పడవచ్చు.

ప్రదర్శనను ప్రారంభించనున్న కలెక్టర్

పి.గన్నవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన జిల్లా విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను శనివారం ఉదయం 9గంటలకు కలెక్టర్ డాక్టర్ రావిరాల మహేష్‌కుమార్, పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ప్రారంభించనున్నారు. జిల్లా స్థాయి ప్రదర్శనకు జెడ్పీ ఉన్నత పాఠశాలలో అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశారు. విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను విజయవంతం చేసేందుకు 17 కమిటీలను ఏర్పాటు చేశారు.

21, 22, 23 తేదీల్లో రీజనల్ స్థాయి పోటీలు

జిల్లా స్థాయి ప్రాజెక్టులను ఈ నెల 21, 22, 23 తేదీల్లో పుదుచ్చేరిలో నిర్వహించనున్న రీజనల్ స్థాయి ప్రదర్శనకు ఎంపిక చేస్తారు. సాధారణ పాఠశాలలతో పాటు అటల్ ల్యాబ్ ఉన్న పాఠశాలలు కూడా జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనవచ్చు. అయితే అటల్ ల్యాబ్‌లో తయారు చేసిన ప్రాజెక్టులే ప్రదర్శించాలి. జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌లో రాష్ట్ర స్థాయి ప్రదర్శనలో పాల్గొన్న ప్రభుత్వ పాఠశాల ప్రాజెక్టులు నేరుగా జిల్లా స్థాయికి నామినేట్ అవుతాయి. రాష్ట్ర స్థాయికి జిల్లా నుంచి విద్యార్థి వ్యక్తిగత, గ్రూపు విభాగాలతో పాటుగా, ఉపాధ్యాయ విభాగం నుంచి రెండేసి వంతున మొత్తం ఆరు ప్రాజెక్టులు రీజనల్ స్థాయికి ఎంపిక చేయనున్నారు. రాష్ట్ర స్థాయిలో అన్ని జిల్లాల నుంచి వచ్చిన వ్యక్తిగత విభాగాల నుంచి 15, గ్రూపు విభాగాల నుంచి పది, ఉపాధ్యాయ విభాగం నుంచి పది మొత్తం 35 ప్రాజెక్టులను రీజనల్ స్థాయికి పంపిస్తారు.

ఆదర్శ మహిళ సావిత్రీబాయి పూలే



ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు. చిత్రంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి, ఎంపీపీ భాగ్యలక్ష్మి

అమలాపురం టౌన్: తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా సావిత్రీ బాయి పూలే సాంఘిక దురాచారాలపై నిరంతర పోరాటాలు చేసి ఆదర్శ మహిళగా నిలిచిపోయారని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు అన్నారు. ఇలాంటి ఆదర్శ మహిళ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం ఓ పండగలా నిర్వహించాలని డిమాండ్ చేశారు. సావిత్రీబాయి పూలే 194వ జయంతిని పురస్కరించుకుని స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో శుక్రవారం ఆమె విగ్రహానికి ఎమ్మెల్సీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. సావిత్రి బాయి పూలే సిద్ధాంతాలకు అనుగుణంగానే గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మహిళలకు పెద్ద పీట వేసి చివరకు నామినేటెడ్ పదవుల్లో సైతం 50 శాతం రిజర్వేషన్లు కల్పించారని ఆయన గుర్తు చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, మండల పరిషత్ అధ్యక్షురాలు కుడుపూడి భాగ్యలక్ష్మి, మహిళా మున్సిపల్ కౌన్సిలర్లు, మహిళా ఉపాధ్యాయుల పాల్గొన్నారు. మహిళా ప్రజాప్రతినిధులు, మహిళా ఉపాధ్యాయులను నేతలు సత్కరించారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఎస్.రాజరాజేశ్వరి, విజయకుమారి, మున్సిపల్ కౌన్సిలర్లు కొల్లాటి దుర్గాబాయి, వాసర్ల లక్ష్మి, దొంగ నాగసుధారాణి, గండి హారిక తదితరులు ప్రసంగించారు.

ఇంకెన్నేళ్లీ సెస్‌బిషలు!

- రూ.47 కోట్లు పైగా బకాయిలు చెల్లించని స్థానిక సంస్థలు
- నగరపాలక సంస్థలు, పంచాయతీలదే అధిక వాటా
- ఉమ్మడి జిల్లాలో 102 గ్రంథాలయాలు
- అభివృద్ధికి శాపంలా మారిన బకాయిలు
- వెంటనే చెల్లించాలని విన్నపాలు



జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పుస్తకాలు చదువుతున్న పాఠకులు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: విజయవాడలో ప్రభుత్వం 35వ పుస్తక మహోత్సవాన్ని ఆర్భాటంగా నిర్వహిస్తున్న వేళ.. రాష్ట్రవ్యాప్తంగానే గ్రామీణ గ్రంథాలయాలకు ఊపిరి పోయాలని.. వీటికి పూర్వ వైభవం తీసుకు వచ్చే దిశగా అడుగులు వేయాలని పాఠకులు డిమాండ్ చేస్తున్నారు. ఒకవైపు డిజిటలైజేషన్ కొత్త పుంతలు తొక్కుతున్న ప్రస్తుత తరుణంలో సైతం గ్రంథాలయాలకు మాత్రం ఎక్కడా ఆదరణ తగ్గడం లేదు. వీటికి వస్తున్న పాఠకుల సంఖ్య కూడా క్రమంగా పెరుగుతూనే ఉంది. ఈ పరిస్థితుల్లో గ్రంథాలయాల్లో వసతులు మెరుగు పరచాలని పాఠకులు కోరుతూనే ఉన్నారు. స్థానిక సంస్థలు సెస్ బకాయిలు చెల్లిస్తేనే ఇది సాధ్యమవుతుంది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లావ్యాప్తంగా ఉన్న వివిధ స్థాయిల్లోని 102 గ్రంథాలయాలకు ప్రతి రోజూ 25 వేల నుంచి 30 వేల మంది పాఠకులు వస్తుంటారని అంచనా. గతంలో కంటే గ్రంథాలయాలకు వస్తున్న వారి సంఖ్యలో ఏడెనిమిది శాతం పెరుగుదల కనిపిస్తోంది.

ఏళ్ల తరబడి బకాయిలు

గ్రంథాలయాల నిర్వహణకు ప్రధాన వనరు స్థానిక సంస్థలు చెల్లించాల్సిన సెస్. ప్రజల నుంచి ముక్కుపిండి మరీ స్థానిక సంస్థలు పన్నులు వసూలు చేస్తున్నా.. అందులోని వాటా మాత్రం ఏళ్ల తరబడి గ్రంథాలయాల ఖాతాలకు చేరడం లేదు. గ్రంథాలయాల సెస్‌ను స్థానిక సంస్థలే దర్జాగా వాడేసుకుంటున్నాయి. ఈవిధంగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా స్థానిక సంస్థల నుంచి వసూలైన గ్రంథాలయ సెస్ రూ.47,13,87,848 కోట్ల మేర ఆయా స్థానిక సంస్థల వద్ద పెండింగ్‌లో ఉండిపోయింది. దీనిపై జిల్లా అధికారులను అడుగుతూంటే స్థానిక సంస్థల అధికారులతో నిర్వహిస్తున్న సమీక్షా సమావేశాల్లో పదేపదే చెబుతున్నామంటున్నారే తప్ప.. ఆయా సంస్థలు చిల్లిగవ్వ కూడా బదలాయించిన దాఖలాలు కనిపించడం లేదు. 2007–08 నుంచి పెండింగ్‌లో ఉన్న కోట్లాది రూపాయల సెస్ బకాయిలు రాబట్టేందుకు చర్యలు తీసుకుంటున్న దాఖలాలు కనుచూపు మేరలో కూడా కనిపించడం లేదు. ఈ పరిస్థితి గ్రంథాలయాల పూర్వ వైభవానికి పెద్ద ప్రతిబంధకంగా పరిణమించింది.

ఒకప్పుడు 51.. నేడు 5

ఒకప్పుడు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో 51 గ్రామీణ గ్రంథాలయాలు ఉండేవి. వీటి నిర్వాహకులకు ప్రతి నెలా అప్పట్లో రూ.15 వేల నుంచి రూ.18 వేల వరకూ వేతనం చెల్లించేవారు. వీటిల్లో పని చేసిన ఉద్యోగులు ఉద్యోగ విరమణ చేయడంతో ఆ పోస్టులను తిరిగి భర్తీ చేయలేదు. ఫలితంగా 46 గ్రామీణ గ్రంథాలయాలు మూతపడ్డాయి. ప్రస్తుతం ఎ.మల్లవరం కట్టమూరు, ఉప్పలగుప్తం, తాటిపర్తి, సాకుర్రుల్లో మాత్రమే నడుస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో గ్రామీణ గ్రంథాలయాల స్థానంలో గౌరవ వేతనంపై నిర్వహించే బుక్ డిపాజిట్ సెంటర్లు (బీడీసీ – పుస్తక నిక్షిప్త కేంద్రం) ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అవే కొనసాగుతున్నాయి. అలానే రాజమహేంద్రవరం, కాకినాడ నగరాలతో పాటు పలు పట్టణాల్లో రిక్షాలపై పుస్తకాలు పెట్టి చదివించే మొబైల్ లైబ్రరీలు ఉండేవి. కాలక్రమేణా అవి కూడా కనుమరుగయ్యాయి. గ్రంథాలయాలకు కొత్త పుస్తకాలు అవసరమని గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రతిపాదనలు పంపినా నిధులు లేవనే సాకుతో గాలికొదిలేశారు. ఈ పరిస్థితుల్లో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ముందుకు వచ్చి 2022లో రూ.1.20 కోట్ల వ్యయంతో పాఠకులు ఎంతో కాలంగా అభ్యర్థిస్తున్న సుమారు 80 వేల పుస్తకాలు కొనుగోలు చేసి, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని గ్రంథాలయాలకు సమకూర్చింది.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో గ్రంథాలయాల వివరాలు

జిల్లా కేంద్ర గ్రంథాలయం	కాకినాడ
గ్రేడ్–1 శాఖా గ్రంథాలయాలు	5
గ్రేడ్–2 శాఖా గ్రంథాలయాలు	10
గ్రేడ్–3 శాఖా గ్రంథాలయాలు	86
మొత్తం	102
గ్రంథాలయాల్లో సభ్యులు	38,500

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 2007-08 నుంచి 2023-24 వరకూ స్థానిక సంస్థలు చెల్లించాల్సిన సెస్ బకాయిలు (రూ.)

రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ	19,03,03,000.00
కాకినాడ నగర పాలక సంస్థ	9,66,35,752.00
మున్సిపాలిటీలు	2,38,47,626.00
గ్రామ పంచాయతీలు	16,06,01,470.00

కాకినాడలోని జిల్లా కేంద్ర గ్రంథాలయం



చేయూతనివ్వాలి



స్థానిక సంస్థలు వెంటనే సెస్ బకాయిలు చెల్లించి గ్రంథాలయాల అభివృద్ధికి చేయూతనివ్వాలి. ఇటీవల పాఠకుల సంఖ్య పెరగడంతో అభివృద్ధికి నిధుల అవసరం ఉంది. ముఖ్యంగా కార్పొరేషన్ల నుంచి ఎక్కువగా బకాయిలు పేరుకుపోయాయి. జిల్లా యంత్రాంగాలు చొరవ తీసుకుని బకాయిలు జమ అయ్యేలా చూడాలి.

– వీఎల్ఎన్ఎస్‌వీ ప్రసాద్, కార్యదర్శి, జిల్లా గ్రంథాలయ సంస్థ, కాకినాడ

పాఠకులకు అందుబాటులో ఉండాలి



ప్రజల విజ్ఞానాన్ని పెంచడానికి ఏర్పాటు చేసిన గ్రంథాలయాలు ప్రజలకు అందుబాటులో ఉండాలి. సామర్లకోటలోని గ్రంథాలయం అద్దె భవనంలో రెండో అంతస్తులో ఉండటంతో 40 మెట్లు ఎక్కి వెళ్లాల్సి వస్తోంది. దీంతో, వృద్ధులు, దివ్యాంగులు, గ్రంథాలయానికి దూరమవుతున్నారు. విజ్ఞానాన్ని మరింతగా పెంచేలా గ్రంథాలయంలో పుస్తకాల సంఖ్య పెరగాలి.

– జి.రాజు, గ్రంథాలయ పాఠకుడు, సామర్లకోట

అందాలొలికిన ఆలమంద!


పోటీలలో పాల్గొన్న గిర్ ఆవులు


ప్రదర్శన ప్రారంభించి పుంగనూరు దూడను ఎత్తుకున్న ఎమ్మెల్యే వరప్రసాద్


పాల పోటీలకు వచ్చిన ఒంగోలు ఆవులతో దూడలు


ఆకర్షణగా నిలిచిన కాంక్రీ జాతి ఆవు


అందాల పోటీలకు తాను సై.. అంటూ భీమవరం నుంచి వచ్చిన రెండడుగుల ఎత్తున్న జింగ్ బాంటమ్ జాతి గొర్రె


అందాల పోటీలకు వచ్చిన పుంగనూరు గిత్త

- ఆవుల పాల, ఎద్దుల అందాల పోటీలు ప్రారంభం
- కేశనపల్లిలో గో సమ్మేళన్ పేరుతో మూడురోజుల పాటు నిర్వహణ
- కోస్తా జిల్లాల నుంచి తరలివచ్చిన పలు జాతులు

మలికిపురం: రాష్ట్ర స్థాయి ఆవుల పాల, ఎద్దుల అందాల పోటీలు శుక్రవారం మలికిపురం మండలం కేశనపల్లి ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ప్రారంభం అయ్యాయి. గ్రామానికి చెందిన అడబాల లక్ష్మీ నారాయణ (నాని) ఆధ్వర్యంలో దాతల సహకారంతో ఈ పోటీలను నిర్వహిస్తున్నారు. పోటీలలో పాల్గొనేందుకు కోస్తా జిల్లాల నుంచి తరలివచ్చిన పలు రకాల జాతుల ఎద్దులు, ఆవులతో క్రీడా ప్రాంగణం కళకళలాడుతోంది. గో సమ్మేళన్ పేరుతో మూడురోజుల పాటు పోటీలు జరగనున్నాయి. ఆవుల పాల ఉత్పత్తి పోటీలతో పాటు ఎద్దుల అందాల పోటీలు ఇక్కడ జరుగుతున్నాయి. ప్రఖ్యాత ఒంగోలు జాతితో పాటు పుంగనూరు, గిర్, కాంక్రీ వంటి జాతుల ఆవులు, గిత్తలు, గుర్రాలు, పొట్టేళ్లు కూడా ఇక్కడికి చేరుకున్నాయి.

అంబేడ్కర్ కోనసీమ జిల్లాతో పాటు పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి, విశాఖపట్నం, అనకాపల్లి, నెల్లూరు, ఎన్టీఆర్, గుంటూరు, ప్రకాశం, బాపట్ల, చిత్తూరు తిరుపతి తదితర జిల్లాలకు చెందిన అనేకమంది రైతులు, తమ ఆవులను, గిత్తలను పోటీలకు తీసుకుని హాజరయ్యారు. ప్రదర్శనలను రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఏపీ మార్క్ ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెదకాపు, నీటి సంఘాల అధ్యక్షుడు గుబ్బల శ్రీనివాస్, పినిశెట్టి బుజ్జి, ఎంపీపీ మేడిచర్ల వెంకట సత్యవాణి, సర్పంచ్‌లు యెనుముల నాగు, గుర్లింక సత్తిబాబు, మందపాటి నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు రాపాక సత్యనారాయణ, దిరిశాల బాలాజీ, ముప్పర్తి నాని, అడబాల సాయిబాబు పాల్గొన్నారు.

కోళ్లాహలం


పందెం పుంజును పట్టుకుని కొనుగోలుదారుడి కోసం ఎదురు చూస్తున్న యువకుడు


సంతలో అమ్మకానికి తీసుకువచ్చిన పందెం పుంజులు


పందెం పుంజుల అమ్మకాలతో సందడిగా మారిన ఆర్యావటం కోళ్ల సంత

ఆర్యావటంలో జోరుగా పందెం కోళ్ల అమ్మకాలు

కాజులూరు: మండలంలోని ఆర్యావటం సంత మార్కెట్‌లో పందెం కోడిపుంజుల అమ్మకాలు జోరుగా సాగాయి. ప్రతీ శుక్రవారం గ్రామంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ పక్కన ఉన్న మార్కెట్‌లో కోళ్ల సంత జరుగుతుంది. పరిసర గ్రామాలలోని మహిళలు, రైతులు నాటుకోళ్లను తీసుకువచ్చి ఇక్కడ అమ్మకాలు నిర్వహిస్తుంటారు. కాకినాడ, రామచంద్రపురం, యానం తదితర పట్టణాల నుంచి పలువురు వ్యాపారులు వీటిని కొనుగోలు చేసి వారి ప్రాంతాలకు తీసుకువెళ్లి అక్కడ మళ్లీ మారు విక్రయాలు చేస్తుంటారు. ప్రతీ వారం ఇది పరిపాటిగా జరిగేదే. అయితే సంక్రాతి దగ్గర పడటంతో రెండు, మూడు వారాలుగా కోళ్ల సంతలో పందెం పుంజుల వ్యాపారం జోరుగా సాగుతోంది. సంక్రాంతి వచ్చిందంటే నియోజకవర్గ గ్రామాలలో కోడి పందేలు సాగుతుంటాయి. దీంతో పందెం పుంజులకు మంచి గిరాకీ ఉండటంతో జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతమైన ఏలేశ్వరం, రంపచోడవరం, పశ్చిమగోదావరి జిల్లా జంగారెడ్డిగూడెం, ఖమ్మం తదితర ప్రాంతాల నుంచి పలువురు పందెం పుంజులను తీసుకువచ్చి ఇక్కడ విక్రయిస్తున్నారు.

ఎర్రకోడి, కాకి, నెమలి, డేగ, పూల పచ్చకాకి వంటి జాతుల కోళ్లను ఈ శుక్రవారం సంతలో విక్రయించారు. జాతులను బట్టి ధర రూ.20 వేల నుంచి రూ.లక్ష వరకూ అమ్మకాలు జరిగినట్టు స్థానికులు చెబుతున్నారు. కోడిపందేల నిర్వహణకు అనుమతి లేకపోయినప్పటికీ కోళ్లకు కత్తులు కట్టనంతవరకూ కేసుల నమోదుకు అవకాశం లేకపోవటంతో పందెం పుంజులు విక్రయించినా పోలీసులు కేసులు పెట్టలేకపోతున్నారు. ఇక్కడ కోళ్ల సంత నిర్వహణకు అనుమతులు ఉండటంతో కోళ్ల సంత మాటున పందెం పుంజుల వ్యాపారం సాగుతోంది.

క్లుప్తంగా

గల్లంతైన మత్స్యకారుడి మృతదేహం గుర్తింపు

పి.గన్నవరం: కె.ఏనుగుపల్లి గ్రామంలో ఈ నెల ఒకటో తేదీన వైనతేయ నదిలో చేపల వేటకు వెళ్లి గల్లంతైన మత్స్యకారుడు శేరు వీరకనకరాజు(41) మృతదేహాన్ని శుక్రవారం గుర్తించారు. ప్రమాదం జరిగిన కిలోమీటరు దూరంలో అతడి మృతదేహం నదిలో పైకి తేలింది. గత బుధవారం 15 మంది మత్స్యకారులు పడవలపై వైనతేయ నదీపాయలో అయిలు వలతో చేపల వేటకు వెళ్లారు. నదిలో చెట్టు మోడుకు చిక్కుకున్న అయిలు వలను తప్పించే క్రమంలో వీరకనకరాజు నీట మునిగి గల్లంతైన విషయం విదితమే. అతడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజోలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు రాజేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పి.గన్నవరం ఎస్సై బి.శివకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి మూలాలను పెకిలిస్తాం

- రవాణాను అడ్డుకుంటే పోలీసుల ప్రాణాలు తీస్తారా?
- అమ్మేవారినే కాదు, కొనేవారిని వదలం
- కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్


కృష్ణవరం టోల్ ప్లాజా వద్ద పోలీసులను ఢీకొన్న కారును జగ్గంపేటలో పరిశీలిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

జగ్గంపేట: జాతీయ రహదారిపై గంజాయి రవాణాను అడ్డుకునే పోలీసుల ప్రాణాలు తీసి పారిపోవాలని వ్యాపారులు ప్రయత్నించడం వారి బరితెగింపునకు నిదర్శనమని, జిల్లాలో గంజాయి మూలాలను పెకిలిస్తామని ఎస్పీ విక్రాంత్‌పాటిల్ అన్నారు. జగ్గంపేటలో గంజాయి ముఠాను అరెస్టు చేసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. జాతీయ రహదారిపై గస్తీని మరింత పెంచుతామని అన్నారు. జాతీయ రహదారిపై కృష్ణవరం టోల్ ప్లాజాతో పాటు రాజానగరం లోపు మరికొన్ని చెక్‌పోస్టులు పెట్టేందుకు పరిశీలిస్తామని చెప్పారు. ఇకపై గంజాయి అమ్మకాలు చేసేవారినే కాదు గంజాయి సేవించే వారిని వదలబోమని అన్నారు. వారి వద్ద నుంచి గంజాయి మూలాలు ఎక్కడ వరకూ వున్నాయో అక్కడ వరకూ ఛేదించుకుంటూ వెళతామని తెలిపారు. ఇప్పటికే జిల్లాలో అనేక విద్యాసంస్థలలో సదస్సులు నిర్వహించి మత్తు పదార్థాలకు దూరంగా వుండాలని విద్యార్థుల్లో చైతన్య కలిగిస్తున్నామని చెప్పారు. గంజాయి వ్యాపారులు విద్యాసంస్థల్లోకి ప్రవేశించకుండా అడ్డుకుంటున్నామని తెలిపారు. కృష్ణవరం చెక్ పోస్టు వద్ద గంజాయి తరలిస్తున్న కారు ఢీకొన్న ఘటనలో గాయపడ్డ లోవరాజు అనే కానిస్టేబుల్‌ను మెడికవర్ ఆసుపత్రిలో పరామర్శించి మనోధైర్యాన్ని కల్పించామని చెప్పారు. గంజాయి రవాణను అడ్డుకునేందుకు ఆధునిక సాంకేతికతను వినియోగిస్తామన్నారు.

జాతీయ రహదారిపై సిగ్నల్స్ ఏర్పాటును పరిశీలిస్తాం

జగ్గంపేటలో జాతీయ రహదారిపై జేవీఆర్ సెంటర్ వద్ద సిగ్నల్స్ ఏర్పాటు పరిశీలించి కలెక్టర్ దృష్టికి తీసుకువెళతామని అన్నారు. జాతీయ రహదారిపై గుర్తించిన బ్లాక్ స్పాట్స్ వద్ద వాహనాల వేగాన్ని తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జాతీయ రహదారిపై ప్రమాదాలు జరిగే ప్రదేశాలలో తప్పనిసరిగా విద్యుత్ దీపాలు వెలిగేలా జాతీయ రహదారి నిర్వహణ అధికారులకు సూచించామని చెప్పారు. జాతీయ రహదారి 216పై తీసుకున్న అనేక చర్యల వల్ల ప్రమాదాల సంఖ్య తగ్గుముఖం పట్టిందని, కాని జాతీయరహదారి 16పై ప్రమాదాల సంఖ్య ఇంకా అదుపులోకి రాలేదని, దీనికి ప్రధాన కారణం వాహనాల వేగమే అన్నారు. పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు, జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


భరత్‌చంద్ర (ఫైల్)

రాజానగరం: అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బంధువుకు సీరియస్‌గా ఉందని తెలిసి, చూసేందుకు వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదానికి గురై ఒకరు మృతి చెందగా, మరొకరు గాయపడ్డారు. జాతీయ రహదారిపై స్థానిక గైట్ ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో శుక్రవారం జరిగిన ఈ ప్రమాదానికి సంబంధించిన వివరాలిలావున్నాయి. పెయింటింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్న రాజమహేంద్రవరం రూరల్ మండలం తొర్రేడుకు చెందిన మంగం భరత్‌చంద్ర (20) కాకినాడలోని ఒక ఆస్పత్రిలో సీరియస్ పొజిషన్‌లో ఉన్న తన బంధువును చూసేందుకు మిత్రుడు గొల్లపల్లి నాగేంద్ర (29)తో కలిసి గురువారం రాత్రి బైకుపై వెళ్లాడు. రాత్రంతా అక్కడే ఉండి తెల్లవారుజామున తిరిగి వస్తుండగా పై ప్రాంతంలో ప్రమాదానికి గురయ్యారు. ముందు వెళ్తున్న లారీని అధిగమించే ప్రయత్నంలో బైకు హేండిల్ లారీకి తగులుకొని, అదుపు తప్పి, ఆ లారీ వెనుక చక్రంలో పడిపోవడంతో భరత్‌చంద్ర అక్కడికక్కడే మృతి చెందాడు. నాగేంద్ర గాయాలతో బయటపడ్డాడు. కేసును రాజానగరం ఎస్సై నాగార్జున దర్యాప్తు చేస్తున్నారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	12,000 – 12,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	17,500
గటగట (వెయ్యి)	16,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	16,800
గటగట (వెయ్యి)	15,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	14,500 – 15,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	13,500 – 14,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

యువకుడి దుర్మరణం

దేవరపల్లి: మండలంలోని బందపురం వద్ద గుండుగొలను–కొవ్వూరు జాతీయ రహదారిపై శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందగా మరో యువకుడు తీవ్రంగా గాయపడి రాజమహేంద్రవరం ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. పోలీసుల కథనం ప్రకారం విజయవాడ రూరల్ మండలం కానూరుకు చెందిన జక్కం సుశీల్ తేజస్, పొట్రు లోకేష్ విజయవాడ నుంచి రాజమహేంద్రవరం మోటార్ సైకిల్‌పై వస్తుండగా బందపురం వద్ద హైవేపై మోటార్ సైకిల్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొన్నారు. ఈ ప్రమాదంలో పల్సర్ మోటార్ సైకిల్ వెనుక వైపున కూర్చున్న జక్కం సునీల్ తేజస్ (21) తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మోటార్ సైకిల్ నడుపుతున్న లోకేష్ తీవ్రంగా గాయపడగా చికిత్స కోసం రాజమహేంద్రవరం ప్రవేటు ఆసుపత్రికి తరలించారు. మోటార్ సైకిల్‌ను వేగంగా నడపడం వల్ల ఈ ప్రమాదం జరిగినట్టు ఎస్సై వి.సుబ్రహమణ్యం తెలిపారు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

మండపేటలో కూటమి నేతల బరి తెగింపు

- నూతన సంవత్సర వేడుకల్లో అశ్లీల నృత్యాలు
- మహిళలను వివస్త్రలను చేసి మద్యం సేవిస్తూ చిందులేసిన జనసేన, టీడీపీ నాయకులు


మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ త్రిమూర్తులు

సాక్షి టాస్క్‌ఫోర్స్: మండపేటలో కూటమి నేతలు బరితెగించారు. కొత్త సంవత్సరం ప్రారంభం సందర్భంగా పట్టణంలోని ఓ లేఅవుట్‌లో అశ్లీల నృత్యాలతో వేడుకలు చేసుకున్నారు. మహిళలను వివస్త్రలను చేసి మద్యం సేవిస్తూ జనసేన, టీడీపీ నాయకులు వారితో చిందులేశారు. వీటికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుండటం జిల్లాలో సంచలనంగా మారింది. నూతన సంవత్సర వేడుకల కోసం మండపేట, కపిలేశ్వరపురం మండలాలకు చెందిన కొంతమంది జనసేన నాయకులు భారీ లైటింగ్, సౌండ్ సిస్టమ్‌తో అశ్లీల నృత్యాలను ఏర్పాటు చేసుకున్నారు. ఇందుకోసం రాజమహేంద్రవరం నుంచి ఆరుగురు హిజ్రాలు, మహిళలను తీసుకువచ్చినట్టు తెలుస్తోంది. డీజే సాంగ్స్, విద్యుత్ వెలుగుల్లో మద్యం సేవిస్తూ వారితో నృత్యాలు చేయించారు. మొదట అర్ధనగ్నంగా, తర్వాత పూర్తి వివస్త్రలుగా మహిళలు నృత్యాలు చేయడం వారితో కలిసి కూటమి నాయకులు చిందులు వేయడం వీడియోల్లో స్పష్టంగా కనిపిస్తోంది. ప్రస్తుతం ఈ వీడియోలు ఫేస్‌బుక్, వాట్సాప్ గ్రూపుల్లో హల్‌చల్ చేస్తున్నాయి. 50 మందికి పైగానే జనసేన, టీడీపీ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నట్టు తెలుస్తోంది. అసాంఘిక కార్యకలాపాలతో ఇంత భారీ ఎత్తున వేడుకలు ఏర్పాటు చేసుకున్నా పట్టణంలోని పోలీసుల దృష్టికి రాకపోవడం గమనార్హం. ఇక్కడి నిఘా వ్యవస్థ పనితీరుకు వేడుకలు అద్దం పడుతున్నాయని స్థానికులు అంటున్నారు.

అశ్లీల నృత్యాలపై కేసు నమోదు

మండపేటలోని ఓ లేఅవుట్లో జరిగిన అశ్లీల నృత్యాల ఘటనపై పట్టణ పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది. టౌన్ స్టేషన్లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రూరల్ సీఐ పీ దొరరాజు నిందితుల వివరాలు వెల్లడించారు. పట్టణంలో 31వ తేదీ రాత్రి నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా స్థానిక లే అవుట్లో కొంతమంది వ్యక్తులు వేడుకలు నిర్వహించుకున్నారు. అందులో భాగంగా ఇద్దరు ట్రాన్స్ జెండర్లను తీసుకొచ్చి అశ్లీల నృత్యాలు చేయించారని చెప్పారు. వీడియో ఆధారంగా 13 మందిపై ఎస్ఐ హరికోటి శాస్త్రి కేసు నమోదు చేసినట్టు తెలిపారు. నిందితులను అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు. వీడియోల ఆధారంగా మరి కొంతమందిని గుర్తించి అదుపులోకి తీసుకుంటామని సీఐ దొరరాజు వివరించారు.

సమాజం సిగ్గు పడేలా రేవ్ పార్టీలు : ఎమ్మెల్సీ తోట

మండపేటలో డిసెంబర్ 31న రేవ్ పార్టీ నిర్వహించిన కూటమి కార్యకర్తల వైఖరి సమాజం సిగ్గు పడేలా ఉందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మండిపడ్డారు. శుక్రవారం ఆయన మండపేటలో మీడియాతో మాట్లాడుతూ ఈ విషయమై అధికార పార్టీ నాయకులు సమాధానం చెప్పాలన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారి రాంబాబుపై కేసు పెట్టడంతో పాటు అవసరమనుకుంటే తనపై కూడా కేసులు నమోదు చేస్తారని ఎద్దేవా చేశారు. అధికారం వారి చేతుల్లో వుంది కాబట్టి ఏదైనా చేయడానికి సమర్థులని, ప్లాట్లు అమ్మిన యజమానికి ఆ లేఅవుట్‌తో ఏం సంబంధం ఉంటుందన్నారు. సోషల్ మీడియాలో వచ్చిన వీడియోలు చూస్తుంటే సిగ్గు కలిగించేలా ఉన్నాయన్నారు. గత ఐదేళ్ల పాలనలో ఎప్పుడూ ఇలాంటి వాటికి తావునివ్వలేదని గుర్తు చేశారు. మండపేట చరిత్రలో ఈ ఘటన మాయని మచ్చగా గుర్తుండి పోతుందన్నారు. పట్టణ నడిబొడ్డున ఇటువంటి పార్టీలు జరుగుతుంటే పోలీసుల కంటపడక పోవడం ఆశ్చర్యంగా ఉందన్నారు. అధికార పార్టీ అండ లేకుండా ఆ రోజు పార్టీ జరుగుతుందా అని అనుమానం వ్యక్తం చేశారు.

కాలువలోకి దూసుకుపోయిన కారు

ముగ్గురికి గాయాలు


ప్రత్తిపాడు జాతీయ రహదారి పక్క కాలువలోకి దూసుకుపోయిన కారు

ప్రత్తిపాడు: రోడ్డు పక్కనే ఉన్న కాలువలోకి కారు దూసుకుపోయిన ఘటన ప్రత్తిపాడు జాతీయ రహదారిపై శుక్రవారం జరిగింది. ఈ ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. హైదరాబాద్‌కు చెందిన రాయుడు వంశీకృష్ణ భార్య లక్ష్మీదీప్తి, మూడో తరగతి చదువుతున్న కుమారుడు జీవ్ కనేష్, ఏడాది నిండని కుమార్తె నిహానివల్లి, మరో మహిళ దేవుడమ్మతో కలిసి కారులో విశాఖ బయలు దేరారు. వంశీకృష్ణ నడుపుతున్న కారు స్థానిక మినర్వా విద్యాసంస్థల వద్దకు వచ్చే సరికి అదుపు తప్పి, కాలువలోకి దూసుకుపోయింది. తెలవారుతుండగా జరిగిన ఈ ఘటనలో వంశీకృష్ణ, లక్ష్మీదీప్తి, దేవుడమ్మ తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదం నుంచి జీవ్ కనేష్, నిహానివల్లి సురక్షితంగా బయటపడ్డారు. వీరిని 108 వాహనంలో ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం కాకినాడలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

లారీ, మోటార్ బైక్ ఢీకొని విద్యార్థి మృతి

పెదపూడి: లారీని మోటార్‌బైక్ ఢీకొట్టిన ఘటనలో ఫిజియో థెరపీ విద్యార్థి మృతిచెందాడు. మరో విద్యార్థి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అనపర్తి అడిషనల్ ఎస్సై బి.దుర్గాప్రసాద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి మండలం పక్కిలంక గ్రామానికి చెందిన మానుకొండ చందు, పశ్చిమగోదావరి జిల్లా ద్వారకాతిరుమల మండలం కొమరి గ్రామానికి చెందిన పుచ్చకాయల నవనీత్(22) కరప మండలంలోని సిమ్స్ కాలేజీలో ఫిజియో థెరపీ విద్యను అభ్యసిస్తున్నారు. వారు కాలేజీకి వెళ్లడానికి మోటార్ బైక్‌పై ఈ నెల 2వ తేది సాయంత్రం బయలు దేరారు. రాత్రి 11 గంటల సమయంలో అనపర్తి మండలం పులుగుర్త గ్రామంలో బ్రిడ్జి వద్దకు వచ్చే సరికి ట్రాలీ లారీ డ్రైవర్ సిగ్నల్ సూచించకుండా లారీని ఒక్కసారిగా రోడ్డుపై నిలిపివేశాడు. దీంతో లారీ వెనుక వస్తున్న నవనీత్, చందు లారీని వెనుక నుంచి మోటార్ బైక్‌తో ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో నవనీత్ తలకు బలమైన గాయమైంది. చందు కాలుకు గాయమైంది. వారిని రామచంద్రపురం ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే నవనీత్ మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మెరుగైన వైద్యం కోసం చందును కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. బాధితుడు చందు ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దుర్గాప్రసాద్ తెలిపారు.

యూరియా కోసం రైతుల పాట్లు


పెద్దేవంలో యూరియా కోసం రైతుల పడిగాపులు

తాళ్లపూడి: యూరియా కోసం రైతులు ఎగబడాల్సిన ఇబ్బందికర పరిస్థితి తాళ్లపూడి మండలంలో ఏర్పడింది. రబీ సాగుకు అవసరమైన యూరియాను పొందలేక పోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని మలకల్లి సొసైటీ పరిధిలోని పెద్దేవంలోని సొసైటీ గోడౌన్ వద్దకు యూరియా లారీ వచ్చిందన్న సమాచారం అందడంతో మండలంలోని పెద్దేవం, బల్లిపాడు, వేగేశ్వరపురం, తిరుగుడుమెట్ట గ్రామాల నుంచి అధిక సంఖ్యలో రైతులు చేరుకున్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ గతంలో సొసైటీలలో యూరియా అవసరమైన మేర సరఫరా జరిగేదని, ప్రస్తుతం కృత్రిమ కొరత సృష్టించి, రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.270 ఉన్న యూరియా బస్తాను బయట మార్కెట్‌లో రూ.300కు పైగా విక్రయిస్తున్నారని తెలిపారు. ఐదు బస్తాల కంటే ఎక్కువ ఇచ్చేది లేదని ఆంక్షలు పెడుతున్నారని రైతులు చెప్పారు. దీనిపై ఏవో రుచిత మాట్లాడుతూ నాలుగు రోజులుగా 180 టన్నుల యూరియా వచ్చిందని, రైతులు అందరూ ఒకేసారి కొంటున్నందున ఇబ్బంది ఏర్పడిందని తెలిపారు. దఫ దఫాలుగా వస్తుందని ఆందోళన అవసరం లేదని చెప్పారు.

గోదావరిలో యువకుడి గల్లంతు


గల్లంతైన వీరమణికంఠ (ఫైల్)

ముమ్మిడివరం: మండలంలోని కొత్తలంక వృద్ధ గౌతమీ గోదావరి పాయలో శుక్రవారం స్నానానికి దిగిన ఓ యువకుడు గల్లంతయ్యాడు. ముమ్మిడివరం మండలం కొత్తలంక గ్రామానికి చెందిన మంగ విజయ వీర మణికంఠతోపాటు స్నేహితులు మంగ జస్వంత్, పాత్తూరి పార్థసారథి అమలాపురం బీవీసీ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నారు. శుక్రవారం ముగ్గురూ గోదావరి చెంతకు చేరారు. జస్వంత్, పార్థసారథి గోదావరి ఒడ్డున ఉండగా మంగ విజయ వీరమణికంఠకు ఈత రావడంతో గోదావరి పాయలో స్నానానికి దిగాడు. గోదావరి లోతుగా ఉండటంతో ఒక్కసారిగా నీట మునిగి గల్లంతయ్యాడు. దీంతో ఆ యువకులు ఆందోళనకు గురై కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. ముమ్మిడివరం ఎస్సై డి.జ్వాలాసాగర్, సిబ్బంది, గ్రామస్తులు మర బోటుపై గోదావరి పాయలో గాలింపు చర్యలు చేపట్టారు. ఆచూకీ లభ్యం కాలేదు. మంగ మహాలక్ష్మి, నాగేశ్వరరావు దంపతులకు ముగ్గురు సంతానం కాగా గల్లంతైన వీర మణికంఠ ఏకైక కుమారుడు, లక్ష్మీనవీన, సాయిశ్రీ ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

మట్టి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

కొత్తపల్లి: పోలవరం పుష్కర కాలువపై అక్రమంగా మట్టి తరలిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్టు గొల్లప్రోలు పోలీసులు తెలిపారు. చందుర్తి శివారు ఉన్న పోలవరం పుష్కర కాలువ గట్టుపై గురువారం రాత్రి ట్రాక్టర్లతో అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్నారని సమాచారం రావడంతో ఎస్సై రామకృష్ణ తన సిబ్బందితో వెళ్లారు.

గ్రావెల్ తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని, సీతంపేటకు చెందిన డ్రైవర్ ముత్తిన రాజేష్, దుర్గాడకు చెందిన విపర్తి ఆనంద బాలను అరెస్ట్ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.